కేసీఆర్‌ను కలిసిన చేతిరెడ్డి సందీప్‌రెడ్డి

కేసీఆర్‌తో సతీశ్‌గౌడ్

గులాబీ అధినేతను కలిసిన నాయకులు

చేర్యాల, జూన్ 16 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, గులాబీ అధినేత కేసీఆర్‌ను ఆదివారం గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో చేర్యాల పట్టణానికి చెందిన పలువురు నాయకులు కలిశారు.ఈ సందర్భంగా కేసీఆర్‌కు కండువాలు కప్పి సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన వారిలో యువజన నాయకులు చేతిరెడ్డి సందీప్‌రెడ్డి, పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్(బాచీ) ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి

వెంకట్రామిరెడ్డి మచ్చలేని నాయకుడు

ములుగు, జూన్ 16: ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి మచ్చలేని నాయకుడని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి అన్నారు. మండల కేంద్రం ములుగులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి మీద అవినీతి ఆరోపణలు చేసిని మెదక్ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యలను ఖండించారు. వెంకట్రామిరెడ్డి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు నిరూపిస్తే వాటిని నిరుపేదలకు పంచిపెట్టడానికి బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని, లేనిపక్షంలో మెదక్ ఎంపీ పదవికి రఘునందన్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రఘునందన్‌రావు చేసిన తప్పుడు ఆరోపణలను వెనక్కితీసుకుని క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ప్రజల తిరుగుబాటుకు గురికావాల్సివస్తుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్‌వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, బీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి కొన్యాల బాల్‌రెడ్డి, రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేశ్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో భక్తుల రద్దీ

గంగరేగు చెట్టు వద్ద భక్తులు సందడి

- 25వేల మంది భక్తుల దర్శనాలు

చేర్యాల, జూన్ 16: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. మల్లన్నస్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకరించింది. విద్యాసంస్థలకు సెలవులు ముగిసినప్పటికీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం కొమురవెల్లి క్షేత్రానికి 25వేల మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతి గీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. కార్యక్రమాలలో మల్లన్న ఆలయ ఏఈవోలు గంగా శ్రీనివాస్, శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

నాచగిరిలో ప్రతం ఆచరిస్తున్న భక్తులు

భక్తగిరిదారులు.. వర్గల్ క్షేత్రాలు

వర్గల్, జూన్ 16: వర్గల్ విద్యాధరి క్షేత్రం, నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. నాచగిరిదేవస్థానంలో సామూహిక సత్యదేవుని వ్రతం, వర్గల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల కార్య నిర్వాహకులు తగుచర్యలు చేపట్టారు.

ఎల్లమ్మజాతరకు పోటెత్తిన జనం

జనంతో నిండిన హుస్నాబాద్‌లోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయ ఆవరణం

హుస్నాబాద్‌టౌన్, జూన్ 16: హుస్నాబాద్‌లోని రేణుకాఎల్లమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. హుస్నాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు జనం భారీగా క్యూకట్టారు. అమ్మవారికి ఒడిబియ్యం పొయ్యడం, చీరల సమర్పణ, బోనాలు, పట్నాలు వేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్నాలు వేసేందుకుసైతం జనం ఎక్కువ సంఖ్యలో ఉండటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో ఎల్లమ్మ దేవాలయ ఆవరణం సందడిగా మారింది. జనం అక్కడే సామూహిక భోజనాలు చేసేందుకు ఉండటంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసి పోయింది.

ఆవాలుతో తండ్రీకొడుకుల చిత్రం

గజ్వేల్, జూన్ 16: పితృ దినోత్సవం సందర్భంగా ఆదివారం గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు ఆవాలుతో తండ్రీకొడుకుల చిత్రాన్ని రూపొందించారు. దీంతో పలువురు ఆయన్ని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఆవాలుతో రామరాజు రూపొందించిన చిత్రం

అనుమతుల చాటున ఇసుక అక్రమ దందా

- కమలాయపల్లి చెరువులో జోరుగా ఇసుక తవ్వకాలు
- అక్రమార్కులకు అధికారుల అండదండలు

కమలాయపల్లి వెలగలరాయుని చెరువులో సాగుతున్న ఇసుక తవ్వకాలు

కమలాయపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులు

చేర్యాల/మద్దూరు(ధూళిమిట్ట), జూన్16: ఉమ్మడి మద్దూరు మండలంలోని కమలాయపల్లి వెలగలరాయుని చెరువు నుంచి కొన్ని నెలలుగా కొంతమంది ఇసుక అక్రమంగా తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువులో జేసీబీలను పెట్టి పెద్ద ఎత్తున ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా పరిసర గ్రామాలతో పాటు సిద్దిపేట, చేర్యాల తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు రూ. 6 నుంచి 10వేల వరకు సంపాదిస్తున్నారు. కొంతమంది అక్రమార్కులు వర్షాకాలంలో ఇసుక లభ్యం కాదని చెప్పి ముందు చూపుతో తమ వ్యవసాయ బావులు, రహస్య ప్రదేశాల్లో ఇసుకను డంపు చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజుల కితం గ్రామస్తుల ఒత్తిళ్ల మేరకు చేర్యాల రెవెన్యూ అధికారులు కొన్ని డంపులను సీజ్ చేసి, ఆ సీజ్ చేసిన ఇసుకను నామమాత్రంగా వేలం నిర్వహించారు. వేలంలో ఇసుక దక్కించుకున్న కొంతమంది దానికి రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు పొందారు. అయితే ఆ అనుమతుల చాటున చెరువు నుంచి ఇసుకను తవ్వి అమ్ముకుంటున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక దశలో ఆ ఇసుక ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు ఆ ఇసుకకు అనుమతులు ఉన్నాయని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానికులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం..

కమలాయపల్లి చెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో మద్దూరు పోలీసులు గ్రామానికి చేరుకొని గ్రామస్తులు పట్టుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మతాల పేరుతో రాజ్యాంగ ధిక్కరణ

- ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఖాసీం

మాట్లాడుతున్న ఓయూ ప్రొఫెసర్ ఖాసీం

గజ్వేల్, జూన్ 16: కేంద్రం కులాలు, మతాల పేరుతో రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నదని స్వయాన మంత్రి పదవిని స్వీకరించే సమయంలో పక్కన సాధువులను పెట్టుకొని ఒక మతానికి సింబల్‌గా అధికార లాంచనాలను పూర్తి చేశారని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో ఆదివారం ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకుడు ప్రకాశ్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన విద్యా సదస్సులో 'సంక్షేమంలో సామాజిక విలువలు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం మంత్రులు, అధికారులు ప్రభుత్వ వ్యవహారాల్లోకి మతాన్ని జోడించకూడదన్నారు. టీపీటీఎఫ్ సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడుతూ మూతపడిన పాఠశాలలను తెరిపిస్తామని ప్రభుత్వం చెప్పి నేటికి ప్రణాళిక తీసుకురాలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్‌ను నియమించాలి, 2008 డీఎస్సీపై ఇచ్చిన హామీని నేడు ప్రభుత్వం మరోసారి పరిశీలిస్తామంటుందన్నారు.నాలుగు నెలలుగా స్టాఫ్‌నర్సులకు జీతాలు లేవని, 10వ తేదీన మోడల్ పాఠశాల ఉపాధ్యాయులకు జీతాలు వేశారన్నారు. అనంతరం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క ఆటపాటలతో ఆకట్టుకున్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామచంద్రం, గజ్వేల్ జోన్ కన్వీనర్ నరేందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయేందర్‌రెడ్డి, మల్లికార్జున్,రాజులు, ఎల్లయ్య, సత్తయ్య, మల్లయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న పాండుగౌడ్

మర్కూక్, జూన్ 16: మండలంలోని పాములపర్తికి చెందిన మునిగడప ఆంజనేయులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, మండల ఎంపీపీ తాళ్లపల్లి పాండుగౌడ్ ఆదివారం ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీపీతో పాటు బీఆర్ఎస్ నాయకుడు నర్సింహులు, బాలకృష్ణ, రఘుపతి, పోచయ్య, మహేశ్, అనిల్, స్వామి ఉన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

హుస్నాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 16: హైదరాబాద్‌లోని మియాపూర్‌లో గిరిజన బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్యచేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని కోరుతూ హుస్నాబాద్‌లో ఆదివారం గిరిజన సంఘాల నాయకులు నిరసన తెలిపారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ఈ నిరసనలో నాయకులు మాట్లాడుతూ గిరిజన బాలికను హత్యచేసి రోజులు గడువుస్తున్నా ఘటనకు పాల్పడిన వారిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. గిరిజనుల పట్ల చిన్నచూపు చూడటం తగదని, తక్షణమే ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబానికి సహాయం అందించి మరోసారి గిరిజనులపై దాడులు జరుగకుండా చూడాలన్నారు. ఈ నిరసనలో గిరిజన విద్యార్థి కార్యనిర్వాహక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు తిరుపతినాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సత్యంనాయక్, రైనానాయక్, ఎస్ఎఫ్ఐ నాయకుడు రాజునాయక్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట టౌన్,జూన్ 16 : సిద్దిపేట జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సిద్దిపేటలో ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా శ్రీశైలం,ఉపాధ్యక్షులుగా చంద్రం,భుమయ్య,ప్రధాన కార్యదర్శిగా దిలీప్‌కుమార్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా కిషన్,సహాయ కార్యదర్శిగా రాజం, కోశాధికారిగా బుచ్చిరాజు ఎన్నికయ్యారు. 14 రంగాల కార్మికులు,అన్ని మండలాల, పట్టణాల అధ్యక్ష కార్యవర్గ సభ్యులు,కార్మికులు పాల్గొన్నారు.



కొమురవెల్లి: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కొమురవెల్లి, జూన్ 16 : కొమురవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2007-08 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతో పాటు ఒకరి కొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(ధూళిమిట్ట)లో...

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 16: ధూళిమిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. రెండు దశాబ్దాల తర్వాత చిన్ననాడు చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థులంతా కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు.

ధూళిమిట్ట: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కుంగిన డ్రైనేజీ పైకప్పు

మర్రిముచ్చాల సమీపంలో కుంగిపోయిన డ్రైనేజీ పైకప్పు

చేర్యాల, జూన్ 16: చేర్యాల, కొమురవెల్లి మండలాల పరిధిలో కొనసాగుతున్న జనగామ, సిద్దిపేట జాతీయ రహదారి పనులు నాసిరకంగా జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏండ్లపాటు పటిష్టంగా ఉండాల్సిన నిర్మాణాలు నిర్మించిన నాలుగు రోజులకే కూలిపోతుండడంతో పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నామమాత్రంగా కాంట్రాక్టర్ పనులు చేస్తుండడంతో జాతీయ రహదారి పనుల మనుగడ కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొమురవెల్లి మండల పరిధిలోని మర్రిముచ్చాల గ్రామ సమీపంలో జాతీయ రహదారితో పాటు గ్రామంలో సర్వీస్ రోడ్డు కోసం ఇరువైపులా డ్రైనేజీలను గుత్తేదారుడు నిర్మిస్తున్నాడు. గ్రామ ఎస్సీ కాలనీ వద్ద సీసీ డ్రైనేజీ వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో ఓ లారీ డ్రైవర్ సీసీ డ్రైనేజీపై నుంచి పక్కకు వెళ్లేందుకు లారీ ముందుకు నడిపించడంతో ఒక్కసారిగా పైకప్పు కుంగిపోయింది. దీంతో 24గంటల పాటు లారీ పైకప్పుపైనే ఉండిపోయింది. పటిష్టంగా ఉండాల్సిన నిర్మాణాలు పనులు పూర్తి కాకముందే కూలిపోతే ఎలా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్‌కు అవార్డుల పంట

భద్రాచలంలో అవార్డు అందుకుంటున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్

ములుగు, జూన్ 16: రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ నిర్వహించిన సేవాకార్యక్రమాలకు అవార్డుల పంట పండింది. ఆదివారం భద్రాచలంలో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్‌కు ప్రత్యేక స్థానం లభించింది. 15 విభాగాల్లో క్లబ్ అందించిన సేవలను ప్రశంసిస్తూ అవార్డులు అందజేశారు. బెస్ట్ బౌట్‌స్టాండింగ్ పర్ఫామెన్స్ అవార్డుతో క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి నరసింహారెడ్డి, మెంబర్ అట్రాక్షన్ చైర్మన్ కొడాలి నాని, వాటర్ అండ్ శానిటరీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు జగదీశ్వర్, సభ్యులు నరేశ్‌గౌడ్, సాయిరెడ్డి, మైపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు

అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

జగదేవ్‌పూర్, జూన్ 16: మండలంలోని తీగల్‌నర్సాపూర్ కొండపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వరుసగా సెలవులు రావడంతో పాటు పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో హైదరాబాద్ జంటనగరాలతో పాటు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కొండపోచమ్మ తల్లికి జై వరాలిచ్చే తల్లికి జై అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అంతకుముందు ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ఆకునూరులో బోనాల పండుగ

చేర్యాల: పోచమ్మకు బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు

చేర్యాల, జూన్ 16 : మండలంలోని ఆకునూరులో ఆదివారం గ్రామస్తులు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామంలోని ఊర పోచమ్మ, నల్లపోచమ్మ, కోటమైసమ్మ అమ్మవార్లకు గ్రామంలోని అన్నివర్గాల ప్రజలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే పండుగలో సోమవారం మహంకాళీ అమ్మవారు, మాతమ్మ గ్రామ దేవతలకు బోనాలు సమర్పించనున్నారు. బోనాల పండుగ సందర్భంగా ప్రతి ఇంటికి బంధువులు, స్నేహితులు తరలివచ్చారు.

సముద్రాలలో ..

కోహెడ, జూన్ 16: మండలంలోని సముద్రాలలో ముదిరాజ్‌లు కులదైవం పెద్దమ్మ తల్లి, పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

స్వామి వారి పల్లకీసేవలో భక్తులు

వైభవంగా హనుమత్ కల్యాణం

సిద్దిపేట టౌన్,జూన్ 16 : సిద్దిపేట మార్కెట్ చౌరస్తా వీర హనుమాన్ స్వామి ఆలయంలో సువర్చలా సహిత హనుమత్ కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది.ఆలయం ప్రాంగణంలో స్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు.తెల్లవారు జాము నుంచి ఆలయంలో ప్రత్యేకంగా అఖండ దీపారాధన, ఆంజనేయస్వామికి అభిషేకం తదితర పూజలు జరిగాయి. సువర్చలా సహిత హనుమత్ కల్యాణానికి భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పునీతులయ్యారు.అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

ఘనంగా ఫాదర్స్ డే

మద్దూరు(ధూళిమిట్ట), జూన్16: మద్దూరు మండలంలోని లద్నూర్ బేతనియా చర్చిలో సంఘం పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఫాదర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవెరెండ్ గయిరాజు తండ్రులచే కేక్ కట్ చేయించారు. తండ్రి గొప్పదనం గురించి వివరించారు. కార్యక్రమంలో జీడికంటి సుధాకర్, ఇలితం బాబు, మాచర్ల ఆశిష్, జీడికంటి మధు, మాచర్ల శామ్‌సన్, జీడికంటి సామేల్ పాల్గొన్నారు.

లద్నూర్‌లో తండ్రులచే కేక్ కట్‌చేయిస్తున్న పాస్టర్ రాజు

రేపు విగ్రహాల ఆవిష్కరణ

- హాజరు కానున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 16: ఉమ్మడి మద్దూరు మండలంలోని కమలాయపల్లిలో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ బయో డీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న మధ్యాహ్నం 1:30 గంటలకు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిపూలేల విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

వివాహిత పరారీ

చేర్యాల, జూన్ 16: మండలంలోని కాశేగుడిసెల గ్రామానికి చెందిన ఓ వివాహిత (22) మూడు నెలల పాపను వదిలిపెట్టి ప్రియుడితో ఇంటి నుంచి వెళ్లిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహిత భర్త దుబాయ్‌లో ఉపాధి నిమిత్తం వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వివాహిత అదే గ్రామానికి చెందిన ప్రియుడితో ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదు, బంగారం, వెండి తీసుకుని ఆదివారం వేకువజామున వెళ్లిపోయినట్లు సమాచారం. కోడలు కనిపించకపోవడంతో అత్తామామలు చేర్యాల పోలీసులను ఆశ్రయించారు.

పేదలకు అండగా ఉండాలి

సిద్దిపేట టౌన్, జూన్ 16: పేదలకు అండగా ఉండాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు దర్శి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేటలో ఆదివారం ఇందిరమ్మ వాసవి క్లబ్‌ను ఆయన సందర్శించారు. నిరుపేద విద్యార్థులకు స్టేషనరీ, నోట్‌బుక్స్, నిరుపేదలకు కిరాణా సామగ్రి, దుస్తులు,అన్న పూర్ణ పథకంలో భాగంగా బియ్యం,వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, సెక్రటరీ బాలరాజు,కోశాధికారి కూర శివకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకేంద్రం అధ్యక్షుడిగా రజనీకాంత్‌రెడ్డి

కోహెడ, జూన్ 16: కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామం కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ పాలకేంద్ర అధ్యక్షుడిగా మ్యాకల రజనీకాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన పాలకేంద్రం సర్వసభ్య సమావేశంలో ఆయన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు, డైరెక్టర్లు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

మేదరి సంఘం ఎన్నిక

బెజ్జంకి, జూన్ 16: మండల కేంద్రంలోని మేదరి సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మిడి రాజేశం, ప్రధాన కార్యదర్శిగా అలిపిరెడ్డి శంకర్, కోశాధికారిగా బొమ్మిడి లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా సాయికృష్ణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, సంతోష్, నితీశ్, సాయివర్ధన్ ఎన్నికయ్యారు.

బీమా అందజేత

బెజ్జంకి, జూన్ 16: మండల కేంద్రానికి చెందిన బండిపెల్లి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. పురుషుల పొదుపు సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు పొదుపు, బీమా నగదు రూ. 67869 అందజేశారు. సంఘం అధ్యక్షుడు పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వాసిమల్ల రమేశ్, పాకలవర్గ సభ్యులు వడ్లూరి సాయిలు,మహేశ్, తాడిచెట్టు భూమయ్య, బోనగం నర్సయ్య, లింగయ్య, వడ్లూర్ శ్రీనివాస్, మల్లేశం, రవీందర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

సిద్దిపేట టౌన్, జూన్ 16: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సహకారంతో అపోలో దవాఖాన సౌజన్యంతో 42 వార్డులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని కౌన్సిలర్ కాటం శోభ రాఘురామ్ తెలిపారు. వార్డు కార్యాలయంలో వైద్యులు అన్నిరకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొడుకు దాడిలో తండ్రిమృతి

చేర్యాల, జూన్ 16: మండలంలోని తాడూరులో తండ్రిపై తనయుడు దాడి చేసిన ఘటనలో తండ్రి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గిరుక సత్తయ్య(42) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.శుక్రవారం రాత్రి సత్తయ్య, కుమారుడు శివకుమార్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఒక్కసారిగా కుమారుడు రోకలి బండతో తండ్రిపై దాడి చేయడంతో ఆయన తలపగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఘటనను గమనించిన పలువురు పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గ్రామస్తులు ఘటనా స్థలానికి వెళ్లి తీవ్రంగా గాయపడిన సత్తయ్యను దవాఖానకు పంపించారు. తండ్రిపై దాడి చేసిన తనయుడు అక్కడి నుంచి తప్పించుకుపోయాడు. సత్తయ్య హైదరాబాద్